సేవలు ఆగేట్టు

- రాత్రయితే ఆసుపత్రులకు తాళాలు
- సరిపడా సిబ్బంది లేక ఇబ్బందులు
- చిన్నపాటి వైద్యానికే పట్టణానికి పరుగులు

కె.గంగవరం: ముందే చెబుతున్నాం.. రాత్రయితే ఇక్కడకు రావొద్దు. జ్వరమొచ్చినా, గాయపడి రక్త మోడుతూ వచ్చినా అక్కడ సేవలకు సెలవే. సరిగ్గా సాయంత్రం అయ్యేసరికి గేట్లకు తాళాలు వేసేస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిస్థితి ఇదీ. 24 గంటల వైద్య సేవలు అంటున్నా అదెక్కడా కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సిబ్బంది కొరత, పూర్తిస్థాయిలో మందులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో పేదల పాలిట సంజీవనిలా సత్వర వైద్య సేవలందించిన గ్రామాల్లోని పీహెచ్‌సీలు వైద్య సిబ్బంది కొరతతో రాత్రి సమయంలో ప్రజలు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైద్యానికి పెద్దపీట వేస్తామని గొప్పలు చెప్పుకునే కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతుందని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయంలో 24/7 ఆసుపత్రి సిబ్బంది అందుబాటులో ఉండటం, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి పల్లెల్లో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా వెల్‌నెస్ సెంటర్లను నెలకొల్పింది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి గ్రామాల్లో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్లు ప్రస్తుతం ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో వెల్‌నెస్ ఆసుపత్రులు అందుబాటులోకి రాకపోవడంతో పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరతతో రాత్రి వేళ పట్టణాలకు పరుగెత్తాల్సి వస్తుందని ప్రజలు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో నాలుగు పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో పేకేరు, దంగేరు, కుందూరు, పామర్రు పీహెచ్‌సీలు 24 గంటల ఆసుపత్రులుగా ఉన్నాయి. పేరుకే 24 గంటల ఆసుపత్రులు కానీ, రాత్రి అయితే వైద్యం అందడం లేదని ఆయా గ్రామాల్లోని ప్రజలు వాపోతున్నారు.

సాయంత్రం 4 గంటలకు ఆసుపత్రులను మూసేసి వైద్యులు, సిబ్బంది ఇంటికి వెళ్లిపోతున్నారని, రాత్రి సమయంలో ఆపద వస్తే ఆసుపత్రుల వద్ద నైట్ వాచ్‌మెన్‌లు మాత్రమే ఉంటున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన కె.గంగవరం మండలంలో ఎక్కువగా పాము కాటు, కుక్కగాటు బాధితులతో పాటు, పలు రోగాల బారిన పడిన ప్రజలు రాత్రి సమయంలో పీహెచ్‌సీలను మాత్రమే ఉపయోగించుకుంటారు. కానీ, రాత్రి వేళ పీహెచ్‌సీల వద్ద వైద్య సిబ్బంది లేకపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రామచంద్రపురం వెళ్లి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది.

మందుల కొరత

గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో మందుల కొరత వీపరీతంగా ఉందని ప్రజలు అంటున్నారు. గతంలో పూర్తిస్థాయిలో మందులను గ్రామాల్లోని పీహెచ్‌సీలకు ప్రభుత్వం అందించేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తి స్థాయిలో మందులు ఉండట్లేదని రోగులు చెబుతున్నారు. కొన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు సొంత ఖర్చులతో మందులను కొనుగోలు చేసి రోగులకు వైద్యం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా వైద్యశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల్లోని పీహెచ్‌సీలకు పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించడంతో పాటు మందులను కూడా అందించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

సిబ్బంది కొరత

మండల పరిధిలోని పామర్రు పీహెచ్‌సీలో ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం ఒకరు మాత్రమే ఉన్నారు. కుందూరు పీహెచ్‌సీలో ముగ్గురు ఉండాల్సి ఉండగా.. ఇద్దరు మాత్రమే ఉన్నారు. పేకేరులో ముగ్గురికి ఒకరు మాత్రమే ఉన్నారు. ఒక్కో పీహెచ్‌సీకి ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఇతర సిబ్బంది ఉంటే ఆసుపత్రి వద్ద రాత్రి సమయంలో స్టాఫ్‌నర్సుతో పాటు ఇతర సిబ్బంది ఉండి ప్రజలకు వైద్య సేవలు అందిస్తారు.



సాయంత్రం వేళ తాళం వేసి ఉన్న పేకేరు పీహెచ్‌సీ

కానీ, ఇటీవల జరిగిన బదిలీల్లో నాలుగు పీహెచ్‌సీల వద్ద సంపూర్తిగా ఉన్న సిబ్బంది బదిలీపై వెళ్లిపోయారు. ఉండాల్సిన సిబ్బంది కన్నా తక్కువ మందిని వైద్య శాఖ ఉన్నతాధికారులు పీహెచ్‌సీలకు కేటాయించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత కారణంగా ఇప్పుడు విధులు నిర్వహిస్తున్న వైద్యులు, ఇతర సిబ్బందికి పనిభారం పెరుగుతుంది.

రాత్రి వేళ వైద్యం అందడం లేదు



సుమారు ఏడు గ్రామాల ప్రజలు పేకేరు పీహెచ్‌సీని ఉపయోగించుకుంటారు. గతంలో బాగానే ఉన్నా ప్రస్తుతం నాలుగు గంటల తరువాత వైద్యం అందని పరిస్థితి. వైద్య సిబ్బంది కొరత కారణంగా రాత్రి సమయంలో ఎవ్వరూ ఉండటం లేదు. గ్రామాల్లోని పీహెచ్‌సీలను రాత్రి వేళ పేద ప్రజలు ఆశ్రయిస్తుంటారు. ఏదైనా జరిగితే పట్టణం వెళ్లాల్సి వస్తుంది.

–మేడిశెట్టి ఇజ్రాయేల్, బహుజనవాది, మసకపల్లి.

పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలి



గ్రామాల్లోని పీహెచ్‌సీలు ప్రజలకు చాలా అవసరం. అలాంటి పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది కొరత వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిస్థాయిలో ఉన్నతాధికారులు వైద్య సిబ్బందిని నియమిస్తే ప్రజలకు 24 గంటల వైద్యం అందుతుంది. ప్రజాప్రతినిధులు కూడా స్పందించాల్సిన అవసరం ఉంది.

–నారాయణస్వామి, మాజీ సొసైటీ అధ్యక్షుడు, సుందరపల్లి.

క్లుప్తంగా

సామాన్యులకు న్యాయ పరమైన సేవలందించాలి
–ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


మండపేటలో గోవిందరావును అభినందిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): సామాన్యులు, వైఎస్సార్ సీపీ క్షేత్ర స్థాయి నాయకులు, కార్యకర్తలకు న్యాయపరమైన సేవలందించేందుకు నిత్యం కృషి చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. ఇటీవల పార్టీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన న్యాయవాది టపా గోవిందరావు గురువారం ఎమ్మెల్సీ తోటను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గోవిందరాజుకు శాలువ కప్పి సత్కరించారు. గత ఆరేళ్లుగా నియోజకవర్గంలో లీగల్ సెల్ కన్వీనర్‌గా గోవిందరావు అందించిన సేవలను ప్రశంసించారు.

నేత్రదానం


శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

రాయవరం: పితృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నేత మేడపాటి శ్రీనివాసరెడ్డిని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం పరామర్శించారు. మాచవరం గ్రామానికి చెందిన మేడపాటి రామారెడ్డి(78) అనారోగ్యంతో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. రామారెడ్డి కుమారులు సాయిబాబారెడ్డి, శ్రీనివాసరెడ్డిలను సూర్యనారాయణరెడ్డి పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. రామారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి తదితరులు శ్రీనివాసరెడ్డిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

సచివాలయ ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం


సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి చేతుల మీదుగా సత్కారం అందుకున్న ఉద్యోగులు

కపిలేశ్వరపురం (మండపేట): సచివాలయ వ్యవస్థ సామాన్య ప్రజలకు ఎంతగానో మేలు చేస్తుందని, సచివాయల ఉద్యోగులు అందించిన సేవలు ప్రశంసనీయమని అర్తమూరు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గొలుగూరి విజయభాస్కరరెడ్డి అన్నారు. గ్రామంలో దీర్ఘకాలంపాటు సచివాలయ వ్యవస్థలో విశేషమైన సేవలందించి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న సచివాలయ ఉద్యోగులను వారు ఘనంగా సత్కరించారు. సంక్షేమ పథకాలను సామాన్యుల ఇంటికి వెళ్లి మరీ సేవలందించడం సచివాలయ ఉద్యోగుల ప్రత్యేకత అన్నారు. ప్రభుత్వ రంగంలో సేవలు చిరస్థాయిగా గుర్తింపునిస్తాయని సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుమలత, కార్యదర్శి అనిల్, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండపేట రూరల్ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి రాంబాబు, బీసీ సెల్ మండల కమిటీ సభ్యులు టీకె గణపతి, నాయకులు గోవిందరెడ్డి పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డే వాల్ పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, వైద్యులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 12న జరగనున్న నేషనల్ డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని రామచంద్రపురం రత్నంపేట మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బందితో వైద్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రత్న సుధ మాట్లాడుతూ, 12న అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 ఏళ్లు కలిగిన వారందరికీ భోజనం అనంతరం అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.హేమ సుధీర్, డాక్టర్ డీవీఎస్ వీరభద్రారెడ్డి మాట్లాడుతూ, పిల్లలు తమ చేతులను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకూడదన్నారు. డివిజనల్ సూపర్‌వైజర్ కమల్ శేషు మాట్లాడుతూ, మండల పరిధిలో 91 అంగన్‌వాడీ సెంటర్లు, 102 పాఠశాలలు, 12 టెక్నికల్, నాన్ టెక్నికల్ కళాశాలలు కలిపి మొత్తం 23,164 మంది చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం లక్ష్యంగా ఉందన్నారు. అనంతరం వాల్ పోస్టరును ఆవిష్కరించారు.

అమలు కాని హామీలతో బాబు మోసం


వెంకటాయపాలెంలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న పిల్లి సూర్యప్రకాశ్, నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంలో సర్పంచ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యల్లమిల్లి సతీషకుమారి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ పాల్గొని గ్రామస్తులకు కూటమి వంచన పట్ల అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోలినాడి వరప్రసాద్, ఎంపీపీ అంబటి భవాని, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం


చేనేత కార్మికులకు చెక్కు అందజేస్తున్న మంత్రి, కలెక్టర్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఆదివారపుపేటలో 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్ కుమార్‌తో కలసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో మగ్గాల యూనిట్లు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, దేశంలో వ్యవసాయం తరువాత అత్యధిక శాతం ప్రజలు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చేనేత కార్మికులు మార్కెట్లో డిమాండ్ ఉన్న చేనేత వస్త్రాల తయారీపై దృష్టి పెట్టి జీవనోపాదులను పెంచుకోవాలని సూచించారు. సభలో 90 మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున రూ.45 లక్షల ముద్రా రుణాల చెక్కును కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి ప్రాంతీయ సంచాలకులు ధనుంజయరావు, ఆర్డీఓ దేవరకొండ అఖిల, తహసీల్దార్ మృత్యుంజయరావు, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, ఏడీఓలు గుర్రాజు, వెంకటేశ్వరరావు, డీఓలు గంగరాజు, శ్రీనివాసరావు, చేనేత కార్మికులు, పాల్గొన్నారు.

చేనేత సమస్యల ఏకరువు..

చేనేత సభలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల లివరీ చేనేత సంఘాల ఫెడరేషన్ అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యప్రకాశ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరవు పెట్టారు. చేనేత సంఘాలకు ఆప్కో నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని మంత్రి సుభాష్‌ను కోరారు. దీనిపై స్పందించిన మంత్రి చేనేత సహకార సంఘాలకు ఇన్ని సమస్యలు ఉండటం చాలా బాధాకరమని, ఆగస్టు 16న అద్దంపల్లి సొసైటీ వద్ద చేనేత సమస్యలపై రివ్యూ మీటింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

చరిత్రలో ప్రసిద్ధి చెందిన వృత్తి చేనేత

కపిలేశ్వరపురం (మండపేట): చరిత్రలో ప్రసిద్ధి చెందిన వృత్తిగా చేనేత చరిత్రలో నిలిచిపోతుందని గురువారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. జాతీయ బీసీ సంఘం పట్టణ కమిటీ అధ్యక్షుడు మల్లవలస గణపతిరావు ఆధ్వర్యంలో చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని నేత వృత్తి దంపతులు దొర సత్యనారాయణ, సోమసుందరి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, జాతీయ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కోన సత్యనారాయణ మాట్లాడుతూ ఎంత ఆధునిక కాలంలో ఉన్నా చేనేత వస్త్రాల ప్రాధాన్యం ఏ మాత్రమూ తగ్గలేదన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు వీరమల్లు శ్రీనివాస్, పెంకే గంగాధర్, గోరు అన్నవరం, పిల్లి నివాస్, దోర విస్సు, ప్రధాన కార్యదర్శి ఒంపోలు పోలరాజు, వెంకట్రావు పాల్గొన్నారు.


సామాజిక సేవకుడు డాక్టర్ బిక్కిన


మండపేటలో డాక్టర్ బిక్కినను సత్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): దీర్ఘకాలంగా మండపేట పట్టణంలో వైద్యుడిగా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి గొప్ప సామాజిక సేవకుడని పలువురు అన్నారు. ఆయన 75వ పుట్టిన రోజును పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైద్యులు, రాజకీయ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించి శాలువగా కప్పి సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ పట్టణంలో సుబ్బారాయుడు మెమోరియల్ నర్సింగ్ హోంను నిర్వహిస్తూ వైద్యసేవలనందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా ఐదేళ్లలో లక్షలాది మందికి వివిధ రకాలుగా ప్రభుత్వ లబ్ధిని అందించారన్నారు. డాక్టర్ బిక్కినను కలిసిన వారిలో బీసీ సంఘం అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కోన సత్యనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు పెంకే గంగాధరరావు, గౌరవ అధ్యక్షుడు వీరమల్లు శ్రీనివాస్, నాయకులు మల్లవలస గణపతిరావు, గోరు అన్నవరం, వెంకట్రావు ఉన్నారు.

వివాదాస్పదంగా రెండు మసీదుల కమిటీ

మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన్



రామచంద్రపురం: పట్టణంలోని జామియా, మదీనా మసీదుల కమిటీ నియామకం వివాదాస్పదంగా మారిందని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన్ గురువారం విలేకరులకు తెలిపారు. 3ఏళ్లుగా మసీదు కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న జనాబ్ అబ్దుల్ కరీం వివాదరహితుడిగా ఉంటూ గతంలో లేని విధంగా అభివృద్ధి పనులను చేసి జమాత్ ఆదరాభిమానాలు అందుకున్నారన్నారు. న్యాయవాదిగా ఉన్న అహ్మద్ తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తానే మసీదు కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ప్రకటించుకొని పత్రికల్లో రాయించుకున్నారన్నారు. రామచంద్రపురం మసీదుల నిర్వహణాధికారం స్థానికులు ఎవ్వరికీ లేదని చెబుతూ.. మేనేజ్‌మెంట్ ఉత్తర్వులతో అన్ని వ్యవహారాలు అహ్మద్ చూస్తాడని ప్రకటించడం పట్ల ముస్లిం పెద్దలు సానుకూలంగా లేరని చెప్పారు. అహ్మద్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో అలాంటి వ్యక్తి కమిటీ అధ్యక్షుడిగా ఉండడానికి అర్హుడు కాదని చెప్పారు. గతంలోని పాలక కమిటీనే ప్రస్తుతం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు.


రామచంద్రపురం జామియా మసీదు

తల్లిపాల ప్రాధాన్యాన్ని గుర్తించాలి

కపిలేశ్వరపురం (మండపేట): బిడ్డ ఆరోగ్య రక్షణలో కీలకమైన తల్లిపాల ప్రాధాన్యాన్ని గుర్తించాలని తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అన్నారు. మండపేట రూరల్ మండలం జెడ్.మేడపాడులో గురువారం ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ అధికారి అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లిపాల ఆరోగ్య ప్రాధాన్యాన్ని వివరించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణి, బాలింత, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ గర్భిణీ, బాలింతలు, చిన్నారులు తీసుకునే ఆహారం శాస్త్రీయ పద్ధతిలో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ విజయలక్ష్మి, ఆశ, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న సీడీపీఓ


జెడ్ మేడపాడులో పౌష్టికాహారాన్ని అందజేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం

కె.గంగవరం: తల్లిపాలు మాత్రమే బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ వరాహ లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని కోటిపల్లిలో ఉన్న అండన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మి మాట్లాడారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంతో ఆమెకు క్యాన్సర్ వంటి వ్యాధులు దూరమతాయని చెప్పారు. బిడ్డ పుట్టిన గంటలో తల్లిపాలు ఇస్తే అదే దివ్య ఔషదమన్నారు. తల్లిపాలు ఎంత బిడ్డ ఎదుగుదలకి, ఆరోగ్యంగా ఉండటానికి ఉపయోగపతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు, సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఈఓ–2గా విజయ్‌కుమార్

కపిలేశ్వరపురం: మండల విద్యా శాఖాధికారి 2గా కె.విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ–1 కె.తాతారావు, ఎంఐఎస్ టి.సురేష్, యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శిలు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరి సూరిబాబు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎస్.సత్యనారాయణమూర్తి, సీఆర్పీలు, స్వాగతం పలికారు. విజయ్‌కుమార్ ప్రస్తుతం మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎంఈఓ–2గా ఎఫ్ఏసీగా బాధ్యతలను చేపట్టారు.

ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్‌గా నాయుడు


నాయుడు మాష్టారు

రామచంద్రపురం: పట్టణంలోని శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్‌గా సలాది వెంకటప్పనాయుడును (నాయుడు మాష్టారు) నియమించారు. ఈ మేరకు దేవాదాయ శాఖ నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సభ్యులుగా మార్ని సుబ్బారావు, కొండపల్లి చిరంజీవి రవికుమార్, బాలాంత్రపు లక్ష్మీ సరస్వతి, శిరిగినీడి దుర్గాప్రసాదరావు, అంపోలు వరలక్ష్మి, నరాల సురేష్, బండి సత్యవాణి, ముచ్చుమిల్లి సుజాతలను నియమించారు. నాయుడు మాస్టారు మాట్లాడుతూ, విద్యాదాత కృత్తివెంటి పేర్రాజు పంతుల ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు.

రామాలయ నిర్మాణ పనులకు నేడు భూమిపూజ

రాయవరం: వెదురుపాకలో రామాలయం పునర్నిర్మాణ పనులకు శుక్రవారం భూమిపూజ చేయనున్నారు. ఈ విషయాన్ని ఆలయ పునర్నిర్మాణ కమిటీ గురువారం విలేకరులకు తెలిపారు. స్థానికంగా ఉన్న రెడ్ల రామాలయం జీర్ణస్థితికి చేరుకోవడంతో నూతన ఆలయ నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు కమిటీ తెలిపింది. భూమిపూజచిన్నం వీరవెంకటసత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

బకాయిలున్న దుకాణాలు సీజ్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలోని దుకాణాలకు రూమ్ లీజు బకాయిలు చెల్లించకపోవడంతో 17 దుకాణాలను మున్సిపల్ అధికారులు గురువారం స్వాధీనపర్చుకున్నారు. ఐదు నెలలకు మించి బకాయిలున్న దుకాణాలను స్వాధీనం చేసుకున్నట్టుగా కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. వారి నుంచి రూ.20వేలు జమకావాల్సి ఉందన్నారు. దుకాణదారులు సకాలంలో అద్దెలను మున్సిపల్ ఖాతాకు జమ చేయాలని కమిషనర్ ఆదేశించారు.

12న నులి పురుగుల మాత్రల పంపిణీ


కపిలేశ్వరపురంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: ఈ నెల 12న వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. ఆ మేరకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ తాతారావు, ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్‌ఎం వంగా శ్రీనివాసరావు, సిద్ధార్థ కళాశాల అధ్యాపకుడు కోశెట్టి పరదేశి, అంగన్‌వాడీ, ఆశ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ముమ్మిడివరం: మోటారుసైకిల్‌పై వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ముమ్మిడివరం మండలం అనాతవరం పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం మోటారుసైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని కాట్రేనికోన తహసీల్దార్ కారు ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చేనేత కార్మికులకు సత్కారం

కాజులూరు: దేశంలో చేనేత కార్మికులకు అండగా ప్రధాని మోదీ ప్రభుత్వం నిలుస్తోందని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాజులూరులో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేతలు శివాజీ, మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి రామకృష్ణ తదితరులు చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి పలువురు సీనియర్ చేనేత కార్మికులను శాలువాలతో సత్కరించారు. గొల్లపాలెంలో సంఘ నాయకులు, స్థానిక మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో «నేతన్న నేస్తం» పథకం ద్వారా చేనేత కార్మికులకు జరిగిన లబ్ధిని వివరించారు. టీడీపీ నాయకులు చేనేత కార్మికులను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నారే తప్ప.. ఎటువంటి సహకారాలు చేయలేదని కొప్పుల సత్యనారాయణ ఆరోపించారు.

కోటి వెంకట్రావుకు నివాళి

కె.గంగవరం: మాల మహానాడు వ్యవస్థాపక సభ్యుడు కోటి వెంకట్రావుకు మాల మహానాడు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కె.గంగవరంలో గురువారం మండల మాలమహానాడు ఆధ్వర్యంలో కోటి వెంకట్రావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకుడు గోవిందరాజు మాట్లాడుతూ, మాల మహానాడు వ్యవస్థాపన జరగడానికి వెంకట్రావు ఎంతో కృషి చేశారన్నారు. వ్యవస్థాపన జరిగిన తరువాత ఎంతో మంది దళితులకు న్యాయం చేశారన్నారు. నియోజకవర్గంలో మాల మహానాడు తరపున ఆయన ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. అనంతరం మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, మాజీ ఎంపీటీసీ రవ్వా భూషణం, ఈరెళ్ల రాజు తదితర నాయకులు వెంకట్రావుకు ఘన నివాళి అర్పించారు.

చెత్తకుప్పలు తొలగించాలి

కాజులూరు: మండలంలోని పెనుమళ్లలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించేందుకు పంచాయితీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో సరైన డంపింగ్ యాడ్ లేకపోవడంతో స్థానికులు చెత్తాచెదారం గ్రామ ముఖద్వారంలోని రోడ్డు పక్కన వేస్తున్నారు. పశువులు, కుక్కలు, కోళ్లు సంచరించడంతో చెత్త రోడ్లపైకి పొల్లుకువస్తున్నాయి. రోడ్డుపై ఉన్న చెత్త కుల్లిపోయి దుర్వాషన వస్తుందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. పారిశుధ్య అస్తవ్యస్థంగా తయారవుతుండటంతో అంటురోగాలు ప్రభలే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చెత్త కుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.